భూత్ గృహాలు!

మలక్‌పేటలో 13 ఏళ్లుగా ఖాళీగానే... పట్టించుకోని అధికారులు

- పలు గృహాలు అనధికార కబ్జా...
- కోట్లాది ఆదాయాన్ని కోల్పోతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ప్రత్యామ్నాయ వినియోగంపై శ్రద్ధ ఏదీ..

సైదాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అధికారుల అలసత్వంతో ఒకప్పుడు కళకళలాడిన మలక్‌పేట ప్రభుత్వ ఉద్యోగుల వసతి గృహాలు నేడు శిథిలమై... చెత్తాచెదారం నడుమ.. రక్షణ లేకుండా భూత్ బంగ్లాలను తలపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రశాంతమైన వాతవరణంలో పచ్చటిచెట్ల మధ్య ఉండే క్వార్టర్లు ప్రభుత్వ చర్యల వల్ల నేడు నిరూపయోగంగా కునారిల్లుతున్నాయి. నగరానికి నడిబొడ్డున ఉన్నప్పటికీ వీటిలో ఉండటానికి ఇష్టపడటంలేదు ఉద్యోగులు. రోడ్ల భవనాల శాఖ(ఆర్‌అండ్‌బీ) అధికారులు వీటి అలనాపాలనా విస్మరించింది. ఉద్యోగులకు 1956లో 1096 క్వార్టర్స్ కట్టించి ఇచ్చింది. ఆంధ్రాకాలనీ పేరుతో దాదాపు 68 ఎకరాల విస్తీర్ణంలో అటెండర్లు, క్లర్క్‌లు, సూపరింటెండెంట్లు, గెజిటెడ్ అధికారులకు విడివిడిగా సీ, డీ, ఎంసీ, ఎంఎస్ విభాగాలుగా క్వార్టర్స్ నిర్మించి కేటాయించారు. గతంలో తెలంగాణ, ఏపీ ఉద్యోగుల విభజన జరగకముందు, తెలంగాణ ఏర్పడక ముందు ఈ క్వార్టర్స్ కేటాయింపు జరిగాలంటే సీఎం కార్యాలయం స్థాయిలో పైరవీలు జరిగాయాంటే పరిస్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

నిర్వహణ లోపం... కనీస మరమ్మతులు కరువు

తెలంగాణ ప్రత్యేకరాష్ట్రం ఏర్పడ్డాక ఈ క్వార్టర్స్‌లో ఏపీకి చెందిన ఉద్యోగులు భారీగా తరలి వెళ్లడం, వారి గృహాలు ఖాళీగా మిగిలిపోవడం ఒక కారణమైతే.. అధికారులు కనీస మరమ్మతులు చేపట్టకపోవడం ఇంకో కారణం. ఈ క్వార్టర్స్‌లో నివసించాలన్న ఉద్యోగులకు స్థాయిని బట్టి హౌస్‌రెంట్ అలవెన్స్(హెచ్‌ఆర్‌ఏ)రూ.10వేల నుంచి 20 వేల వరకు కట్ అవుతుందన్న మరో కారణంగా ఇక్కడి ఉద్యోగులు ఆసక్తి చూపడంలేదు. అంతేగాకుండా ప్రభుత్వ అధికారుల కోసం కోట్లాది రూపాయలతో 11 ఏళ్ల క్రితం నిర్మించిన గృహ సముదాయంలో సైతం వసతుల లేమితో ఖాళీగా ఉంటడంతో ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోవలసివస్తుంది.



ప్రభుత్వ క్వార్టర్స్ కిటికీలు, గేట్లు మాయం

ఊసేలేని ఐటీ టవర్...

ప్రభుత్వ గృహ సముదాయంలో 10 ఏకరాలలో 21 అంతస్తులలో ఐటీ టవర్ ఏర్పాటుకు 3 అక్టోబరు 2023 అప్పటి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో వందలాది ప్రభుత్వ గృహాలను కూల్చివేసి చదును చేశారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐటీటవర్ ఏర్పాటుకు మోక్షం లేదు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా...

నిరూపయోగంగా ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఈ గృహాలపై నిర్వహణ చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో అసాంఘికశక్తులకు వరంగామారింది. ఈ ఖాళీగృహాలను కొందరు ఇష్టారాజ్యంగా ఉపయోగించుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. క్వార్టర్స్ పరిసరాలు చెత్తాచెదారంతో నిండాయి. క్వార్టర్స్‌లో కిటికీలు, గేట్లు, ఇతర సామగ్రికి కూడా రక్షణ లేదు. కొన్ని వస్తువులు మాయమవుతున్నాయి. కొందరు క్వార్టర్స్‌కు ఉన్న చిన్నపాటి ప్రహరీలను, గేటులను దూకి లోపల మందు పార్టీలు చేసుకుంటున్నారు.



అడవిని తలపిస్తున్న ప్రభుత్వ క్వార్టర్స్



చెత్తకుప్పలమయంగా ప్రభుత్వ క్వార్టర్స్



మలక్‌పేట బీ కాలనీ ప్రభుత్వ క్వార్టర్స్ ఓ రోడ్డు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను ప్రభుత్వ కార్యాలయాలకు, గురుకులాలు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు కేటాయిస్తే నెలకు ప్రభుత్వానికి లక్షాలాది రూపాయల ఆదాయం మిగిలేది. మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల నేడు ఎంతో విలువైన క్వార్టర్లు నిరూపయోగంగా, అసాంఘిక కర్యాలకు నెలవుగా మారాయి.

\- పగిల్ల శ్రీనివాస్ రెడ్డి, సైదాబాద్

అధికారులు పట్టించుకోక పోవడం దారుణం



ప్రభుత్వ క్వార్టర్స్‌పై అజమాయిషీ చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుండటం దారుణం. ప్రభుత్వ గృహాలలో ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాలు సాగిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నిరూపయోగంగా ఉన్న క్వార్టర్స్ తాళాలు పగులగొట్టి పోకిరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

\- జనపాల మధు, మాదన్నపేట

మురుగునీటి సమస్య పరిష్కరిస్తా



గ్రీన్‌పార్క్‌కాలనీలో రోడ్లపై నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్‌పార్క్‌కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చెప్పారు. గ్రీన్‌పార్క్‌కాలనీలో ఎస్ఎన్‌డీపీ నాలా క్యాచ్‌పిట్స్ ద్వారా మురుగునీరు ఓవర్ ఫ్లో అయి ఇళ్ల ముందుకు వచ్చి చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదివారం ఇంజనీరింగ్ అధికారులు, కాలనీసంక్షేమ సంఘంప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఎస్ఎన్‌డీపీ నాలాలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఎస్ఎన్‌డీపీ నాలా స్లాబ్‌ను తొలగించి సమస్యను పరిష్కరించాలన్నారు. సరూర్‌నగర్‌చెరువు ముఖద్వారం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు, సిల్ట్‌ను కూడా తొలగించాలని సూచించారు. శివగంగా థియేటర్ వద్ద ఉన్న ఎస్ఎన్‌డీపీ నాలా ఔట్‌లెట్ సమస్యను జోనల్ కమిషనర్‌తో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ ఈఈ కార్తీక్, బీఆర్ఎస్ లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు తిలక్‌రావు, జగన్నాథ్‌రెడ్డి, మధుసాగర్, ప్రకాష్, ఇంద్రాజీ, అనిల్, ప్రసాద్, శ్రీకాంత్, అరుణ్, యశ్వంత్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగన్‌రెడ్డి, కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, కార్యవర్గసభ్యులు రాఘవేందర్‌రెడ్డి, సురేష్, శేఖర్, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, రామయ్య, సువర్ణ, యాదాక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



బాలాపూర్‌లో తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. బాలాపూర్ 18వ డివిజన్‌లోని హయత్‌కౌంటీ కాలనీలో మిషన్ భగీరథలో భాగంగా ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరాను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిసర కాలనీలైన షరీఫ్‌నగర్, డ్రీమ్‌సిటీ నివాసితులు తమ కాలనీలకు సైతం తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆమెను కోరారు. ఇతర సమస్యలను సైతం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ దశలవారీగా అన్ని కాలనీలకు సమృద్ధిగా తాగునీరు సరఫరాఅయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బడంగ్‌పేట్‌శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, యువజన విభాగం నాయకుడు బొర్ర మాధవరెడ్డి, కాలనీఅధ్యక్షుడు మహ్మద్ అక్విల్, బీఆర్ఎస్ నాయకులు జెనిగె శ్రీనివాస్‌యాదవ్, డాక్టర్ రవూఫ్, టేకుల భాస్కర్‌రెడ్డి, కాలనీప్రతినిధులు మహ్మద్ బాసిత్, అబ్దుల్ సత్తార్, జమాల్ హమీద్, అజీమ్‌భాయ్, నసీరుద్దీన్ పాల్గొన్నారు.

వీధివ్యాపారం తొలగించొద్దు.. పేదలపొట్ట కొట్టొద్దు



కూల్చివేసిన గుడారాలు, గుడిసెల వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

హయత్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని ఇంజాపూర్ నుంచి ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నంబరు 12 వరకు రోడ్డు వెంట చిన్నచిన్న గుడారాలు, గుడిసెలు వేసుకుని పండ్లు, భోజనం, జ్యూస్ ప్యాయింట్‌లు, తినుబండారాలు విక్రయిస్తున్న వారి షెడ్లను ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వనిత ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. సమాచారం అందుకున్న సీపీఎం నాయకులు అక్కడికి వెళ్లి వీధి వ్యాపారులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, వీధివ్యాపారుల సంఘం గౌరవ అధ్యక్షుడు డి.కిషన్ మాట్లాడుతూ కొంతకాలంగా అనేక మంది నిరుద్యోగులు, పేద మహిళలు తుర్కయంజాల్ ఫారెస్టు గోడనుఆనుకుని చిన్నగుడారాలు వేసుకుని ప్రయాణికులకు, వాహనదారులకు, పాదచారులకు తక్కువ ఖర్చుతో భోజనం పెడుతూ.. బతుకున్నారని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా రకరకాల వ్యాపారం చేసుకుని ఉపాధి పొందుతున్నారు. వీరివల్ల ఎవరికి ఎలాంటి ఇబ్బందులూ లేకపోయినా మున్సిపాలిటీ శానిటేషన్ అధికారులు వాటిని తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతుంటే వాటిని వదిలిపెట్టి పేదలపైన పడి వారి ఉపాధి కోల్పోయేలా చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. మున్సిపాలిటీలో వందల సంఖ్యలో అనుమతి లేకుండా రిస్సార్టులు నిర్మించారని తెలిపారు. వారిపైన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చర్యలు తీసుకోవడానికి పేదలే దొరికారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు పేదలజోలికి రావద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నరసింహ, ఎల్లేష, సత్యనారాయణ, యాదయ్య, కృష్ణ, రవిభాస్కర్, వేమన, రాణి, మల్లీశ్వరి, పావని, శ్యామల, శ్రీను, విజయ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌చార్జీల పెంపుపై బీజేపీ నిరసన ర్యాలీ



నందనవనంలో నిర్వహించిన ర్యాలీలో బీజేపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జీ సామ రంగారెడ్డి తదితరులు

చంపాపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్ చార్జీల పెంపును నిరసిస్తూ బీజేపీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నిరసన ర్యాలీలో బీజేపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జీ సామ రంగారెడ్డి పాల్గొన్నారు. డివిజన్‌లోని టీకేఆర్ కళాశాల నుంచి నందనవనంలోని లక్ష్మీ హోటల్ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, బీజేపీ, బీజేవైఎం నాయకులు రాజుగౌడ్, కిరణ్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్, వెంకటాచారి, మల్లేష్‌యాదవ్, గణేష్, బాలరాజు, విజయ్‌శ్రీ, శశిధర్‌రెడ్డి, రాజేందర్, ప్రభాకర్, విజయ్‌కుమార్, రాజు, లక్ష్మీకాంత్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీకి హైమాస్ట్ లైట్ల వితరణ



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు చెందిన ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఇక్కడి శేషాద్రినగర్ కాలనీలోని పార్కులో సొంత ఖర్చుతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారు. పార్కులో రాత్రిపూట అంధకారం అలుముకుని అసౌకర్యంగా ఉంటున్నదంటూ కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే సొంతంగా సదరు లైట్లను ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో ఆదివారం రాఘవేందర్‌రెడ్డి కాలనీవాసులతో కలిసి లైట్లను ప్రారంభించారు.

వేలంలో 'స్ట్రాంగర్'గా.. వీకర్‌సెక్షన్ కాలనీ



వేలంలో అమ్మవారి వస్తువులను దక్కించుకున్న వారిని సన్మానిస్తున్న వీకర్‌సెక్షన్‌కాలనీ అధ్యక్షుడు కాసాని అశోక్‌యాదవ్

మన్సూరాబాద్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి వస్తువుల వేలంలో మన్సూరాబాద్ డివిజన్‌లోని వీకర్‌సెక్షన్‌కాలనీకి అత్యధిక ధరలు పలికి, స్ట్రాంగర్‌సెక్షన్‌కాలనీ అనిపించుకుంది. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కాసాని అశోక్ యాదవ్ మాట్లాడుతూ దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తమ కాలనీలో ఏర్పాటు చేసిన మండపం వద్ద అమ్మవారికి పదకొండు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించామన్నారు. అనంతరం శనివారం రాత్రి అమ్మవారి శేషవస్త్రాలు, ముక్కుపుడక తదితరాలకు నిర్వహించిన వేలంలో మొత్తానికి కలిపి రూ.5,27,250లతో పలువురు వాటిని తమ సొంతం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీసభ్యులు నాంపల్లి శ్రీరాములు, రాజశేఖర్‌యాదవ్, గోవర్దన్‌రెడ్డి, కృష్ణ సాయికిశోర్, స్వామి, అఖిల్ యాదవ్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి



విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన పాడి గేదెలు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తు విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు(బర్లు) మృతి చెందాయి. హయత్‌నగర్ పోలీసులు, స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన సన్నీళ్ల నరసింహ ఆదివారం తన పాడిగేదెలను తోలుకుని మేత కోసం ఎక్సలెన్సియా కళాశాల వైపుకు వెళ్లాడు. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభం నేల వైపునకు ఒరిగింది. దీంతో కరెంటు వైర్లు ప్రమాద భరితగా మారాయి. గేదెలు గడ్డి మేసుకుంటూ స్తంభం వైపు వెళ్లాయి. ఒక గేదె కొమ్ములు విద్యుత్ వైరుకు తగిలింది. దీంతో పక్కపక్కనే ఉన్న రెండుగేదెలు షాక్‌కుగురై మృత్యువాత పడ్డాయి. దీంతో రైతు నరసింహ విలపించాడు. రెండు గేదెలు దాదాపు రెండున్నర లక్షల విలువచేస్తాయని తెలిపారు. ఒరిగిన స్తంభంతో ప్రమాదం ఉందని పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా వినిపించుకోలేదని తెలిపాడు. తనకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని కోరాడు. ఈ మేరకు బాధితుడు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యల పరిష్కారం కోసం..

ఫీజ్ ఆఫ్ కాల్ సెంటర్ 24/7

ట్రాన్స్‌కో ఏడీఈ వెంకట నర్సింహారెడ్డి



చంపాపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను నేరుగా ఫీజ్ ఆఫ్ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసి తక్షణ పరిష్కారం పొందవచ్చని, కాల్ సెంటర్ 24/7పని చేస్తుందని చంపాపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఆపరేషన్) సరూర్‌నగర్ సర్కిల్ (ఏడీఈ) వెంకట నర్సింహారెడ్డి అన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో ఏడీఈ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నపుడు ప్రజలు విద్యుత్ ఇనుప స్తంభాలకు దూరంగా ఉండాలని, ట్రాన్స్‌ఫార్మర్లలో మంటలు, వీదురు గాలులకు వైర్లు తెగిపడిన వెంటనే ఫీజ్ ఆఫ్ కాల్ సెంటర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ప్రజలు అప్రమత్తతతో పెనుప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఇంట్లో విద్యుత్ సమస్యలు తలెత్తినపుడు ట్రాన్స్‌కో సిబ్బంది లేదా టెక్నీషియన్స్‌తో మరమ్మతులు చేయించాలని సూచించారు. విద్యుత్ తీగలను చిన్నారులకు దూరంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, విద్యుత్‌తీగలపై దుస్తులు ఆరేయవద్దని పేర్కొన్నారు. ఇంట్లో విధిగా ఎర్తింగ్ ఏర్పాటు ఉండాలని, ఇండ్ల పైనుంచి వెళ్లే హైటెన్షన్ వైర్లకు దూరంగా ఉండాలని ఏడీఈ కోరారు.

ప్రశ్న: మీ డివిజనల్ పరిధిలో ఎన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి..

జవాబు: డివిజన్ పరిధిలో నాలుగు విద్యుత్ 33/11కేవి సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇందులో చంపాపేట, మీర్‌పేట, లెనిన్‌నగర్, బడంగ్‌పేట పరిధిలో ఉన్నాయి.

ప్రశ్న: ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఎన్ని విద్యుత్ కనెక్షన్లు కలిగి ఉన్నాయి.

జవాబు: ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లక్షా యాభైవేల గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతినెలా విద్యుత్ బిల్లుల రూపంలో రూ.12.50కోట్లు వసూళ్లు అవుతున్నాయి.

ప్రశ్న: కొత్తగా సబ్‌స్టేషన్ల ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయా!

జవాబు: నందనవనం ఏరియాలో కొత్తగా 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

ప్రశ్న: ఫీజ్ ఆఫ్ కాల్ సెంటర్లు ఏ ఏరియాలో ఉన్నాయి..సెల్ నెంబర్ల వివరాలు?

జవాబు: చంపాపేట..సెల్ నెం. 8712472415-మీర్‌పేట...సెల్ నెం. 8712472417-లెనిన్‌నగర్..సెల్ నెం. 8712472422- బడంగ్‌పేట...సెల్ నెం. 871247242

ప్రశ్న: ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్లు(ఆపరేషన్) ఎందరు ఉన్నారు?

జవాబు: చంపాపేట డివిజన్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ సెల్ నెం 8712472414

- మీర్‌పేట డివిజన్ ట్రాన్స్‌కో ఏఈ బాలాగౌడ్ సెల్ నెం 8712472416
- లెనిన్‌నగర్ డివిజన్ ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ సెల్ నెం 8712472421
- బడంగ్‌పేట డివిజన్ ట్రాన్స్‌కో ఏఈ వి.శ్రీనివాస్ సెల్ నెం 8712472426

ముసారాంబాగ్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పద సంచలన్



స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, ఆర్‌ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు

చాదర్‌ఘాట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మలక్‌పేట నగర్ పద సంచలన్ కార్యక్రమం ఆదివారం ముసారాంబాగ్‌లో జరిగింది. ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత ప్రధానకార్యదర్శి మల్లికార్జున్‌తోపాటు ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముసారాంబాగ్‌లోని బాలమ్మ దానమ్మ బస్తీ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్ పద సంచలన్ వెస్ట్ ప్రశాంత్‌నగర్, శ్రీపురంకాలనీ, సలీంనగర్ కాలనీల మీదుగా సాగింది. వ్యక్తి నిర్మాణం చేసుకుంటూ జాతీయ భావాలను నింపుకుంటూ ఈ దేశాన్ని పరమ వైభవ స్థితికి తీసుకురావడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మల్లికార్జున్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నగర ప్రధానకార్యదర్శి సుధాకర్, నగర సంఘచాలక్ రామకృష్ణ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధానకార్యదర్శి బొక్క మధుసూదన్‌రెడ్డితోపాటు సుమారు వంద మందికి పైగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలమ్మదానమ్మ బస్తీ గ్రౌండ్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

ఆలయాల అర్చకులకు పండుగ కానుక



అర్చకులకు పండుగ కానుక అందజేస్తున్న చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని అన్ని దేవాలయాల అర్చకులకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దసరా, దీపావళి పండుగ కానుకగా నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకకళ్యాణం కోసం ఆ భగవంతుని పూజించే అర్చకులకు పండుగ కానుకగా ప్రతి సంవత్సరం నూతన వస్త్రాలు అందజేస్తున్నామన్నారు.

నగరం వైపు వాహనాల బారులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దసరా పండగను సొంతూరులో జరుపుకుని తిరుగు ప్రయాణమైన నగరవాసులు హైదరాబాద్‌కు సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఏర్పడింది. సోమవారం తవ తమ పనుల్లో చేరేందుకు రాత్రికి ఇంటికి చేరుకోవడానికి వస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ నుంచే వాహనాలు మెల్లగా నగరం వైపుకు కదులుతున్నాయి. హయత్‌నగర్ హైవే బవార్చీ, భాగ్యలత కాలనీ వద్ద స్వల్పంగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. రాత్రి మొత్తం జాతీయ రహదారిపైన రద్దీ ఉండే అవకాశం ఉంది.



టీఎస్ఆర్ సులక్షణ సీనియర్ సిటిజన్స్ నూతన కార్యవర్గంను అభినందిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

టీఎస్ఆర్ఎస్ఎస్ సిటిజన్ కార్యవర్గం

చంపాపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ లక్ష్మీనర్సింహాకాలనీలోని టీఎస్ఆర్ సులక్షణ సీనియర్ సిటిజన్స్ నూతన కార్యవర్గంను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడిగా నరసింహారెడ్డి, అధ్యక్షుడిగా పి.నాగేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా జె.మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామచంద్రమూర్తి, కోశాధికారిగా వరప్రసాద్, జాయింట్‌సెక్రటరీగా మాధవరెడ్డి, ఆసరా వైస్‌ప్రెసిడెంట్‌గా ప్రతాప్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథులుగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ హాజరై ఆసరా రూమ్‌ను ప్రారంభించారు. అనంతరం కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ద్వారకా తిరుమలేశుని సన్నిధిలో ఉప్పల



ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఆయన కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందిస్తున్న ఆలయ పండితులు

మన్సూరాబాద్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లాలోని ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామిని టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సతీమణి ఉప్పల స్వప్న, కుమారులు సాయికిరణ్, సాయితేజ, కోడలు శార్వారీలతో పాటు పబ్బ శేఖర్, కట్ట రవి, నరేష్, అశోక్ తదితరులు ఉన్నారు.



నూతన కార్యవర్గం ప్రతినిధులు

న్యూ మధురాపురి కాలనీ కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 4వ డివిజన్‌లోని న్యూమధురాపురి కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అశోక్, ప్రధానకార్యదర్శిగా రేవంత్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా బల్వంత్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీఅధ్యక్షుడు తాడూరి వెంకటరమణ, ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాగార్జున, ఎస్వీఎస్ ప్రసాద్, బసవరాజు పాల్గొన్నారు.